
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 18 మార్చి 2024



నేటి నుంచి కలెక్టరేట్‌లో స్పందన రద్దు

మహారాణిపేట, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు ఈ కార్యక్రమం నిర్వహించడానికి అవకాశం లేదని, జిల్లా వాసులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే స్పందన, మొదటి, రెండో సోమవారం నిర్వహించే డయల్ యువర్ మేయర్ కార్యక్రమాలను కూడా రద్దుచేస్తున్నట్టు కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు.



వాల్తేరు క్లబ్ జంక్షన్ వద్ద తొలగించని వైసీపీ ఫ్లెక్సీ



జాయింట్ కలెక్టర్ బంగ్లా ఎదురుగా గల బస్టాప్‌పై తొలగించని వైసీపీ పోస్టర్

కోడ్ అమలులో వివక్ష

- వైసీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగుల తొలగింపులో అధికారులు మీనమేషాలు
- జనసేన, టీడీపీ, బీజేపీవి తొలగింపు
- అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు
- ఎన్నికల కమిషన్ ఆదేశాలూ బేఖాతర్
- యంత్రాంగం తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా వైసీపీపై అధికారులకు ప్రేమ తగ్గడం లేదు. నిబంధనలను తోసి రాజని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. షెడ్యూల్ విడుదల చేసిన 24 గంటల్లోగా ప్రభుత్వ భవనాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను తొలగించాలని ఆదేశించినప్పటికీ, వైసీపీ మినహా మిగిలిన పార్టీల హోర్డింగ్‌లను తొలగించి జిల్లాలోని అధికారులు చేతులు దులుపుకోవడం విమర్శలకు దారితీస్తోంది.

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయపార్టీలు ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపుపై అధికారులు వివక్ష పాటిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలు, నేతల ఫొటోలు, ఫ్లెక్సీలు ఉండకూడదని ఎన్నికల కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అయితే జిల్లా అధికారులు మాత్రం టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించి, వైసీపీకి చెందిన పోస్టర్లు, ఫ్లెక్సీలను మాత్రం అలానే వదిలేయడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల్లోగా రాజకీయపార్టీలు, నేతలకు సంబంధించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించాలి. ఇందుకోసం జీవీఎంసీ, జిల్లా అధికార యంత్రాంగం శనివారం సాయంత్రం నుంచే రంగంలోకి దిగింది. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ ఉన్న రాజకీయ పార్టీలు, నేతలకు చెందిన హోర్డింగులు, పోస్టర్లను తొలగించడంతోపాటు నేతల విగ్రహాలకు ముసుగులు వేసే పని ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నానికి టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన హోర్డింగులు, పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించిన

... మిగతా 6వ పేజీలో


ఆర్టీసీ బస్సుపై ప్రభుత్వ పథకాల పోస్టర్

ఉల్లంఘనలపై 100 నిమిషాల్లో స్పందించాలి: కలెక్టర్



విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్ని కలకు సంబంధించి కోడ్ ఉల్లంఘనల ఫిర్యాదులపై 100 నిమిషాల్లో సమాధానం ఇవ్వాలని అధికారులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరె న్స్‌లో పాల్గొన్న అనంతరం రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులకు సీ-విజిల్‌ను ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. యాప్‌లో పౌరులు చేసిన ఫిర్యాదులపై స్పందించి వెంటనే సమాధానం ఇవ్వాలన్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కచ్చితంగా పనిచేసి, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుచేయాలన్నారు. డబ్బు, వస్తువుల పంపిణీపై సకాలంలో విచారణ చేయాలని,

...మిగతా 6వ పేజీలో

అమర్‌పై అసంతృప్తి!

'గాజువాక'లో తొలి సమావేశానికే కీలక నేతలు డుమ్మా

- హాజరుకాని ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ సమన్వయకర్త చందు, పలువురు కార్పొరేటర్లు
- అంతంతమాత్రంగానే వచ్చిన కార్యకర్తలు
- బోసిపోయిన సమావేశ మందిరం

గాజువాక, మార్చి 17:

గాజువాక నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్‌పై నేతల అసంతృప్తి తొలి సమావేశంలోనే బయటపడింది. తనను అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఆదివారం ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో సమావేశం ఏర్పాటు చేస్తున్నానని, దీనికి పార్టీ శ్రేణులు హాజరుకావాలని ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ ఎమ్మెల్యే నాగిరెడ్డితో సహా కీలక నేతలు, ఏడుగురు కార్పొరేటర్లు కూడా డుమ్మా కొట్టారు. దీంతో గాజువాక టికెట్‌ను అమర్‌కు ఇవ్వడంపై వైసీపీలో అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

గత ఎన్నికల్లో అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గుడివాడ అమర్‌నాథ్‌ను, వైసీపీ అధిష్ఠానం ఈసారి ఎన్నికల్లో అనూహ్యంగా గాజువాక అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన మొదటిసారిగా ఆదివారం నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే సమావేశానికి నేతలతో పాటు కేడర్ హాజరు కావాలని ఆయనతోపాటు టికెట్ దక్కని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కూడా పిలుపునిచ్చారు. అయితే తన ఇంటికి సమీపంలోనే ఈ ఫంక్షన్ హాల్ ఉన్నప్పటికీ.. నాగిరెడ్డితో సహా కీలక నేతలెవరూ సమావేశానికి హాజరుకాలేదు. మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వార్డు స్థాయి నాయకులు మాత్రమే హాజరయ్యారు. అంతేకాకుండా పార్టీ కేడర్ కూడా అంతంతమాత్రంగానే వచ్చారు. దీంతో సమావేశ మందిరం వెలవెలబోయింది. గాజువాక టికెట్ లభించిన తరువాత అమర్‌నాథ్ తొలిసారి నిర్వహించిన ఈ సమావేశానికి సీనియర్ నేతలే కాకుండా అత్యధిక కార్పొరేటర్లు పాల్గొనకపోవడంపై నియోజకవర్గంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఏడుగురు కార్పొరేటర్‌లు డుమ్మా

గాజువాక నియోజవర్గం పరిధిలో ఎనిమిది మంది వైసీపీ కార్పొరేటర్లు (65వ వార్డు బొడ్డు నరసింహపాత్రుడు, 66వ వార్డు ఇమ్రాన్ అహ్మద్, 68వ వార్డు గుండాపు వెంకటసాయి అనూష, 70వ వార్డు ఉరుకూటి రామచంద్రరావు, 71వ వార్డు రాజాన రామారావు, 73వ వార్డు భూపతిరాజు సుజాత, 74వ వార్డు తిప్పల వంశీరెడ్డి, 85వ వార్డు ఇల్లపు వరలక్ష్మి) వున్నారు. అమర్‌నాథ్ ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఏకంగా ఏడుగురు కార్పొరేటర్లు ముఖం చాటేశారు. 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత మాత్రమే హాజరయ్యారు.

చల్లారని అసమ్మతి

గాజువాక వైసీపీ

... మిగతా 6వ పేజీలో

పిల్లల ఆస్పత్రి హుళక్కే?

- ఆర్‌సీడీ ఆస్పత్రిలో ఏర్పాటుకు ప్రతిపాదన
- ప్రభుత్వానికి, ఆరోగ్యశాఖకు డీపీఆర్ సమర్పణ
- రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో ఏర్పాటుకు సీఎం ఆదేశం
- నాలుగేళ్లు దాటినా ప్రతిపాదన దశ దాటని దుస్థితి



(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

ఆరంభంలో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించడం...ఆ తరువాత పట్టించుకోకపోవడం వైసీపీ ప్రభుత్వానికి రివాజుగా మారింది. ఈ కోవలోనే జిల్లాలో చిన్నారులకు ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు ప్రక్రియ మూలనపడింది. చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించే ఉద్దేశంతో రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి స్థాయిని పెంచేలా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిపై సానుకూలంగా స్పందించి, డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించడంతో ఆర్‌సీడీ ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా యంత్రాంగం డీపీఆర్‌తోపాటు ఇతర వివరాలను అందించారు. పరిశీలించిన ప్రభుత్వం విశాఖతోపాటు మరో రెండుచోట్ల పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దాదాపు నాలుగేళ్లు దాటినా అడుగుముందుకు పడలేదు.

ప్రస్తుతం పెదవాల్తేరులోని రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి ప్రాంగణంలో చిన్నారులకు సంబంధించిన కొన్నిరకాల సమస్యలకు వైద్య సేవలు అందుతున్నాయి. దీనినే పీడియాట్రిక్ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం కూడా ఇదే ప్రాంగణాన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు సానుకూలత వ్యక్తం చేసింది. ఆచరణ దిశగా అడుగులు వేయకపోవడం గమనార్హం.

రూ.197 కోట్లతో ప్రతిపాదనలు

పీడియాట్రిక్ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలంటూ

... మిగతా 6వ పేజీలో

ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వ్యాపారుల దందా!

యథేచ్ఛగా ఎంఆర్‌పీ ఉల్లంఘన

- ప్రతి వస్తువుపై రూ.ఐదు నుంచి పది అదనంగా వసూలు
- వ్యాపారులతో నిత్యం ప్రయాణికుల ఘర్షణ
- అయినా పట్టించుకోని బస్‌స్టేషన్ అధికారులు
- లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలని వివరణ
- నెలవారీ మామూళ్లు ముడుతున్నాయనే ఆరోపణలు

ఐటెం	ఎంఆర్‌పీ	విక్రయిస్తున్న ధర
కూల్‌డ్రింక్ అరలీటర్	రూ.40	రూ.50
లేస్ ప్యాకెట్	రూ.15	రూ.20
వాటర్‌బాటిల్ (లీటర్)	రూ.20	రూ.25
పాప్‌కార్న్	రూ.15	రూ.20
బ్రిటానియా బిస్కెట్ ప్యాకెట్	రూ.20	రూ.30


ద్వారకా కాంప్లెక్స్‌లో దుకాణాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వ్యాపారుల దందాసాగుతోంది. వస్తువులన్నింటినీ ముద్రిత ధరలు (ఎంఆర్‌పీ)కి విక్రయించాల్సి ఉన్నా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో వస్తువుపై కనీసం రూ.ఐదునుంచి రూ.పది వరకూ వసూలు చేస్తున్నారు. దీనిపై కొంతమంది ప్రయాణికులు వ్యాపారులను నిలదీస్తుండడంతో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. అక్కడే ఉన్న అధికారులు ప్రత్యక్షంగా ఈ దృశ్యాలను చూస్తున్నప్పటికీ తమకు సంబంధంలేదన్నట్టు వెళ్లిపోతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు అందడం వలనే వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో విజయవాడ తర్వాత అతిపెద్దదిగా ద్వారకాబస్‌స్టేషన్‌కు గుర్తింపు వుంది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు 804 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. సుమారు 40 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తాయి. దీంతో బస్‌స్టేషన్ నిత్యం రద్దీని సంతరించుకుంటుంది. ప్రయాణికులతోపాటు వారిని సాగనంపేందుకు, రిసీవ్ చేసుకునేందుకు మరో పది వేల మంది వస్తుంటారు. దీంతో బస్‌స్టేషన్‌లో తాగునీరు, కూల్‌డ్రింకులు, బిస్కెట్లు వంటి వాటికి డిమాండ్ ఎక్కువ. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆహారపదార్థాలు, కూల్‌డ్రింకులు, బేకరీ ఉత్పత్తులు విక్రయించేందుకు 44 దుకాణాలున్నాయి. వీటిని ఆర్టీసీ అధికారులు టెండరు ద్వారా వ్యాపారులకు కేటాయిస్తారు. దుకాణంలో ఏయే వస్తువులు విక్రయించాలి, నాణ్యత, ఎంఆర్‌పీ అమలుపై నిత్యం పర్యవేక్షణ ఉండాలి. ఎవరైనా నాణ్యతలేని వస్తువులను విక్రయించినా, ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేసినా జరిమానా విధించడంతోపాటు దుకాణాల కేటాయింపును రద్దుచేసేలా ముందస్తు ఒప్పందం కుదుర్చుకుంటారు.

యథేచ్ఛగా ఉల్లంఘన

ద్వారకాబస్‌స్టేషన్‌లో వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఒక వస్తువు విక్రయించేందుకు దుకాణాన్ని

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి పది పరీక్షలు

- జిల్లాలో 138 కేంద్రాల్లో నిర్వహణ
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు
- హాజరుకానున్న 31,379 మంది విద్యార్థులు
- మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు ఓపెన్‌స్కూల్ పరీక్షలు


సీతమ్మధార ఎస్‌ఎఫ్ఎస్ స్కూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమ వారం నుంచి పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 138 కేంద్రాల్లో ఏర్పాట్లను పూర్తిచేసినట్టు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు జిల్లాలోని 31,379 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ 28,367, ప్రైవేటు 3,012 మంది విద్యార్థులున్నారు. రెగ్యులర్ విద్యార్థులలో 14,972 మంది బాలురు, 13,395 బాలికలున్నారు. ఆంగ్ల మాధ్యమంలో 24,644 మంది, తెలుగు మాధ్యమంలో 3,704 మంది, పదిమంది ఉర్దూ, తొమ్మిది మంది ఒరియా మాధ్యమంలో పరీక్షలు రాస్తారన్నారు.

పరీక్షలకు నగరంలో 107, గ్రామీణ ప్రాంతంలో 31 మొత్తం 138 కేంద్రాలు ఏర్పాటుచేశారు. 1,400 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. 300 మందితో సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాట చేశారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లు అందజేశారు. విద్యార్థుల సంఖ్య మేరకు గదులు కేటాయించి, బెంచీలపై నంబర్లు వేశారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయం, మరుగుదొడ్లను అందుబాటులో

... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.11
సహరి (మంగళ)	4.47

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ

- 59 శాతం మంది అభ్యర్థులు హాజరు


ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 35 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పేపర్-1 పరీక్ష ఉదయం పది నుంచి 12 గంటల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు జరిగాయి. పరీక్షకు మొత్తం 19,668 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 11,679 (59 శాతం) హాజరుకాగా, 7,985 మంది (41 శాతం) గైర్హాజరయ్యారు. రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు తరలివచ్చారు. కేంద్రంలోకి స్మార్ట్‌వాచ్, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేకపోవడంతో సిబ్బంది నిశితంగా పరిశీలించి లోపలకు పంపించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షల తీరును పరిశీలించారు. సీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ శివాజీపాలెంలోని ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, మెయిన్‌క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల, జ్ఞానాపురం సోఫియా కళాశాలలోని కేంద్రాలను సందర్శించారు.

శభాష్ 'మేధ'ర్షి

- సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో నునపర్తి విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్
- 283/300 మార్కులు సాధించిన రెడ్డి మేధర్షి
- జాతీయస్థాయిలో 43వ ర్యాంకు


రెడ్డి మేధర్షి

అచ్యుతాపురం, మార్చి 17: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సైనిక్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి మేధర్షి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది జనవరి 28న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించగా, ఈ నెల 14న ఫలితాలు వెల్లడయ్యాయి. రెడ్డి మేధర్షి 283/300 మార్కులతో జాతీయస్థాయిలో 43వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు రాజేశ్, స్వర్ణలత ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నారు. మేధర్షి రెగ్యులర్ పాఠశాలకు వెళుతూనే ఆన్‌లైన్లో వైజాగ్ సైనిక్ అకాడమీ సెంటర్లో కోచింగ్ తీసుకున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు.

విశాఖ ఉత్తరం
నియోజకవర్గం

రైతుబజారులో దొంగకు దేహశుద్ధి


పట్టుబడిన దొంగ

మద్దిపాలెం, మార్చి 17: ఇక్కడి రైతు బజారులో ఆదివారం కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఓ వినియోగదారుని జేబులో నుంచి సెల్ ఫోన్ దొంగలించేందుకు యత్నిస్తూ ఓ యువకుడు పట్టుబడ్డాడు. దీంతో సదరు వినియోగదారునితో పాటు పలువురు కొనుగోలుదారులు ఆ దొంగకు దేహశుద్ధి చేసి రైతు బజారు ఎస్టేట్ అధికారికి అప్పగించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి ఆ దొంగను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కాగా మద్దిపాలెం రైతు బజారులో దొంగల బెడద ఎక్కువగా ఉందని, తరచూ సెల్ ఫోన్లను తస్కరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా బల్లల పండుగ

మాధవధార, మార్చి 17: జీవీఎంసీ 51వ వార్డు పరిధి అప్పయ్యనగర్‌లో ఆదివారం రజకుల బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. రజకుల కులవృత్తి లాభదాయకంగా సాగాలని కోరుకుంటూ దుస్తులు ఉతికే బండలను పూజించారు. రజక సంఘం ప్రతినిధులు మడక సూరిబాబు, కె.అచ్చిబాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగలో వైసీపీ నాయకుడు కేకే రాజు పాల్గొని బల్లల వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల తర్వాత డీఎస్సీ నిర్వహించాలి'

అక్కయ్యపాలెం, మార్చి 17: ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలను ఎన్నికల తర్వాత జరపాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కోరారు. ఎన్నికల్లో పలువురు నిరుద్యోగులు కూడా పోటీ చేస్తున్నందున చదువుకునేందుకు సమయం ఉండదని, అందువల్ల ఆ తర్వాత నిర్వహించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రశ్నపత్రంలో పెద్ద ప్రశ్నల వల్ల సమయం సరిపోక అర్హత కోల్పోతారేమోనని, 1:100గా మెయిన్స్‌కు ఎంపిక చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారన్నారు. ఒక ప్రశ్నకు ఒక నిమిషం సమయమిస్తే ఎక్కువ ప్రశ్నలకు చిట్కాలు వాడినా ఐదు నిమిషాలు పడుతుందని, అందువల్ల ఏపీపీఎస్సీ నిర్వాహకులు పునరాలోచించి 1:100గా మెయిన్స్ ఎంపిక చేపట్టాలన్నారు.

30 నుంచి నూకాంబిక జాతర

మురళీనగర్, మార్చి 17: జీవీఎంసీ 49వవార్డులోని నూకాంబిక అమ్మవారి వార్షిక కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఈ నెల 30 నుంచి ఏప్రిల్ ఎనిమిదో తేదీ వరకు జరగనున్నాయి. నవరాత్రుల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నగేష్ ఉత్సవాల పోస్టరు ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఉడుపు రాటతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాల సందర్భంగా నూకాంబిక అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు కుంకుమ పూజలు చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పీఎస్‌ల పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

సిబ్బందికి డీసీపీ-2 సత్తిబాబు సూచన


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ-2 సత్తిబాబు

మద్దిపాలెం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎలక్షన్ కమిషనర్ నిబంధనలకు అనుగుణంగా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని డీసీపీ-2 మోకా సత్తిబాబు సూచించారు. ఆదివారం ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ ఆవరణలో గల వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో ఆయన వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి కోడ్ అమలులోకి వచ్చినందున అందరూ తమ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉండాలన్నారు. సమావేశంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సౌత్ ఏసీపీలతో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


ఆర్పీ పాఠశాల స్కూల్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు

కంచరపాలెం, మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండడంతో కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని ఆర్పీపేట, కప్పరాడ, కె.కాలనీ,స్టెల్లా మేరిస్, మాధవధార, తదితర కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం తొమ్మిదన్నర నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించారు. కాగా ఆర్పీపేట పాఠశాలలో 240 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నందున పది గదులను సిద్ధంగా ఉంచారు. విద్యుత్, తాగునీరు, మెడికల్, తదితర సదుపాయాలు కల్పించినట్టు హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.


జ్ఞానాపురం ఫ్లైఓవర్‌పై మరమ్మతులు


పాఠశాల గోడను పునర్నిర్మించిన దృశ్యం

జ్ఞానాపురం ఫ్లైఓవర్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జ్ఞానాపురం, మార్చి 17: ఎట్టకేలకు జ్ఞానాపురం ఫ్లైఓవర్‌కు మరమ్మతులు చేపట్టారు. 'రంగులు సరే.. రోడ్ల మాటేమిటి' శీర్షికన ఈనెల ఆరో తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి గోతులను పూడ్చిస్తున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మాణం

సీతమ్మధార: నక్కవానిపాలెం, మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాలలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. అసంపూర్తి ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బాలబాలికలకు పౌష్టికాహారం పంపిణీ


చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

మురళీనగర్, మార్చి 17: జీవీఎంసీ 50వ వార్డులో 'మా వాకర్స్ క్లబ్' ఆధ్వర్యంలో ఆదివారం క్రీడా సాధన చేస్తున్న బాలబాలికలకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ చిన్నారులకు మజ్జిగ, గుడ్లు, అరటిపండ్లను అందజేశారు. మా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల బాక్సింగ్ క్రీడలో ప్రాక్టీస్ చేస్తున్న బాలలను అభినందించారు. బాక్సింగ్ కోచ్ చౌదా, ఎస్.భానుప్రకాశ్, మా వాకర్స్ క్లబ్ సెక్రటరీ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అది ఆలిండియా చంద్రబాబు కమిటీ సభ

కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రం గురించి మాట్లాడే హక్కు లేదు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

గాజువాక, మార్చి 17: ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో శనివారం నిర్వహించిన సభ కాంగ్రెస్ పార్టీది కాదని, ఆలిండియా చంద్రబాబు కమిటీ సభ అంటూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. ఆదివారం గాజువాకలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సభను చంద్రబాబు లబ్ధి కోసం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిర్వహించారని విమర్శించారు. చంద్రబాబు అజెండానే షర్మిల అజెండా అని అన్నారు. చంద్రబాబు ప్రత్యక్షంగా ఒక పార్టీతో, పరోక్షంగా మరో పార్టీతో పొత్తులు పెట్టుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని విభజించి చిన్నాభిన్నం చేసిన కాంగ్రెస్ పార్టీకి, షర్మిలకు ఏపీ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడే హక్కు వైసీపీకి, స్టీల్‌ప్లాంట్ యూనియన్‌లకు, సెంటిమెంట్‌గా భావించే వారికి మాత్రమే ఉందని ఆయనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసిన రాష్ట్రంలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కించుకోలేదని అమర్‌నాథ్ పేర్కొన్నారు.

కోడ్ అమలులో వివక్ష!

... 5వ పేజీ తరువాయి

అధికారులు, చాలా చోట్ల వైసీపీకి చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల జోలికి వెళ్లకుండా వదిలేశారు. తగరపువలస నుంచి ఆనందపురం జంక్షన్, కొమ్మాది, మద్దిలపాలెం వరకూ జాతీయ రహదారి వెంబడి ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వైసీపీకి చెందిన 'సిద్ధం, నాకు ఒక కల ఉంది' వంటి నినాదాలతో ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీలను హోర్డింగ్‌లను తొలగించాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ, జిల్లా అధికారులు, సిబ్బంది వాటిని అలాగే వదిలేశారు. శ్రీనగర్ నుంచి వడ్లపూడి వెళ్లే దారిలో కూడా వైసీపీకి చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను వదిలేసిన అధికారులు, ఇతర పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను మాత్రం పూర్తిగా తొలగించడం ఆశ్చర్యానికి గురిచేసింది. నగరం నడిబొడ్డున సిరిపురం కూడలి, ఎల్ఐసీ భవనం వెనుకరోడ్డు, రామ్‌నగర్ కూడళ్లలో కూడా ఇతర పార్టీల ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు, వైసీపీ ఫ్లెక్సీల జోలికి వెళ్లకపోవడం విశేషం. వైసీపీ అధికారంలో ఉందనే భయంతో ఆపార్టీ పట్ల అధికారులు ఇంతకాలం ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని భావించి ప్రజలకు, ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చిన తర్వాత కూడా అదే అవ్యాజ్య ప్రేమను చూపుతున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

ఉంచారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేస్తున్న నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్ల బందోబస్తు నిర్వహిస్తారు. చంద్రంపాలెం, తోటగరువు, గాజువాక, నడుపూరు, కణితి, గోపాలపట్నం ఉన్నత పాఠశాలల్లో ఏ, బీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ప్రతి సెంటర్‌లో సామర్థ్యాన్ని బట్టి గదికి 24 మంది, తక్కువగా 16 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు సెంటర్లలో ఏర్పాట్లను డీఈవో చంద్రకళ ఆదివారం పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలంటూ 'ఆల్‌ది బెస్ట్' చెప్పారు.

మధ్యాహ్నం ఓపెన్ స్కూళ్ల పరీక్షలు

కాగా జిల్లాలో పది, ఇంటర్ ఓపెన్‌స్కూల్ పరీక్షలు సోమవారమే ప్రారంభమవుతాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించే పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరగకుండా ప్రతి కేంద్రంలో సిటింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

అమర్‌పై అసంతృప్తి!

... 5వ పేజీ తరువాయి

సమన్వయకర్తగా కొనసాగుతున్న తిప్పల దేవన్‌రెడ్డిని కాదని కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును పార్టీ అధిష్ఠానం నియమించి, అతనినే అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి అసమ్మతి జ్వాలలు రేగుతున్నాయి. పార్టీ నిర్ణయాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా తనకు గాని, తాను సూచించిన వ్యక్తికి గాని టికెట్ ఇవ్వాలంటూ అనుచరవర్గంతో కలిసి తాడేపల్లిలో ప్రయత్నాలు చేశారు. దీంతో సామాజిక సమీకరణల నేపథ్యంలో చందును సమన్వయకర్తగా నియమించామని, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వివరణ ఇచ్చారు.

ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని అభ్యర్థిగా ప్రకటించాలని నాగిరెడ్డి పట్టుబట్టారు. ఈ క్రమంలో కొద్దిరోజులు నియోజకవర్గమంతటా మేయర్‌తో కలిసి పర్యటించి, జనానికి పరిచయం కూడా చేశారు. అయితే గాజువాకలో కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండడం కలిసి వస్తుందని టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పైరవీలు చేశారు. మరో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఇదిలా ఉండగా సమన్వయకర్తగా నియమించిన చందును మార్చిన పార్టీ అధిష్ఠానం ఊహించని విధంగా మంత్రి అమర్‌నాథ్‌ను రంగంలోకి తెచ్చింది. అయినప్పటికీ నేతల అసంతృప్తి చల్లారకపోవడంతో అమర్ నిర్వహించిన తొలి సమావేశం పేలవంగా జరిగింది.

పిల్లల ఆస్పత్రి హుళక్కే?

... 5వ పేజీ తరువాయి

సీఎం ఆదేశించి పలుమార్లు సమీక్ష నిర్వహించారు. విశాఖలో పీడియాట్రిక్ ఆస్పత్రి ఏర్పాటుకు రూ.197 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆర్‌సీడీ ఆస్పత్రి 25 ఎకరాల్లో ఉంది. 70 పడకలతో రోగులకు సేవలు అందిస్తున్నారు. పీడియాట్రిక్ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తే సుమారు 500 పడకలతో అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇక్కడ పోలియో, సెరిబ్రల్ పాలసీతో బాధపడే చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించడంతోపాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ వంటి సేవలు అందిస్తున్నారు. దీనిని పీడియాట్రిక్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్/ అభివృద్ధి చేసినా పీడియాట్రిక్ న్యూరో, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ ఫిజియోథెరపీ వంటి అధునాతన శస్త్ర చికిత్స విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఆయా విభాగాలకు సంబంధించిన స్పెషలిస్టు వైద్యులు, ఇతర వైద్య సిబ్బందిని నియమిస్తారు. దీనివల్ల చిన్నారులకు సంబంధించిన వైద్య సేవల్లో ఇదో అడ్వాన్స్‌డ్ సెంటర్‌గా మారేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే అవకాశాల ముగిసినట్టేనని చెబుతున్నారు. కాగా ఈ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయించేందుకు పనిచేసిన ఓ అధికారి కూడా బదిలీపై వెళ్లిపోవడంతో పీడియాట్రిక్ ఆస్పత్రి ప్రతిపాదన హుళక్కేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

వ్యాపారుల దందా!

... 5వ పేజీ తరువాయి

తీసుకుని, అదనపు వస్తువులను విక్రయించడం, ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. వాటర్‌బాటిల్ ఎంఆర్‌పీ రూ.20 ఉంటే కొన్ని దుకాణాల్లో రూ.25, మరిన్ని దుకాణాల్లో రూ.30కు విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింకు అరలీటర్ రూ.40 కాగా, రూ.50కి విక్రయిస్తున్నారు. చిన్నపిల్లలు ఇష్టంగా తినే లేస్ చిన్న ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.15కాగా రూ.20కి విక్రయిస్తున్నారు. బ్రిటానియా బిస్కెట్ ప్యాకెట్ చిన్నది రూ.20 కాగా రూ.25కి విక్రయిస్తున్నారు. అధికంగా వసూలు చేయడంపై ప్రయాణికులు నిలదీస్తే 'నచ్చితే కొనండి. లేకపోతే వెళ్లిపోండంటూ' నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. దీంతో కొంతమంది ప్రయాణికులు వ్యాపారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. నిత్యం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా బస్‌స్టేషన్‌లోని అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా అధికారులకు వివరిస్తే, లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని మాత్రమే సమాధానమిస్తున్నారు. దుకాణాల నిర్వాహకుల నుంచి అధికారులకు ప్రతినెలా మామూళ్లు అందుతుండడంతోనే చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంఆర్‌పీ ఉల్లంఘిస్తే చర్యలు

- అంధవరపు అప్పలరాజు, రీజనల్ మేనేజర్

ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో ఎంఆర్‌పీకి మాత్రమే విక్రయించాలి. ఎవరైనా ఉల్లంఘిస్తే లిఖితపూర్వకంగా స్టేషన్ మేనేజర్ కార్యాలయం, విచారణ కౌంటర్ వద్ద ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టెలో వేస్తే, పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఉల్లంఘన రుజువైతే మొదటిసారి రూ.500 నుంచి రూ.వెయ్యి జరిమానా, తర్వాత కూడా ఉల్లంఘన జరిగితే దుకాణం రద్దుకు నోటీసు ఇస్తాం. అప్పటికీ మారకుంటే కేటాయింపును రద్దుచేస్తాం.

ఉల్లంఘనలపై 100 నిమిషాల్లో స్పందించాలి

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోతే సమీపంలోని జీవీఎంసీ, పోలీస్ శాఖల సీసీ కెమెరాలు పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. రిటర్నింగ్ అధికారి తమ పరిధిలో సింగిల్ విండోవిధానం, మీడియాసెల్, కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నియమావళిని అమలుచేయండి

సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఉద్యోగులంతా ఎన్నికల నియమావళిని పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ షెడ్యూల్ విడుదలైన 24 గంటల్లో ప్రభుత్వ ఆస్తులపై గల అన్నిరకాల గోడ రాతలు, పోస్టర్లు, కటౌట్లు, బేనర్లు, హోర్డింగ్‌లు, జెండాలు తొలగించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు, బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, రోడ్ వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మునిసిపల్ సమావేశ ప్రదేశాల్లో రాతలు, కటౌట్లు, తొలగించాలని ఆదేశించారు. సీ విజిల్ మానిటరింగ్ ఫిర్యాదుల పరిష్కారం, ఫిర్యాదులపై 24 గంటల్లో తీసుకున్న చర్యలు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. వలంటీర్ల విధులపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు.ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పనిచేసేలా చూడాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, అడిషినల్ కమిషనర్ విశ్వనాథన్, జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ దక్షిణం
నియోజకవర్గం

కనక మహాలక్ష్మికి రూ. లక్ష విరాళం

జగదాంబ కూడలి, మార్చి 17 : వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన చల్లా సుధారాణి దంపతులు లక్ష రూపాయల విరాళం సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో వారు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డికి ఆదివారం అందజేశారు. దాత కుటుంబీకులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

రోడ్లపై మురుగుతో అవస్థలు


లేపాక్షి వద్ద మెయిన్ రోడ్డుపై మురుగు నీరు


కాలువలో నుంచి బయటకు వస్తున్న నీరు

జగదాంబ కూడలి, మార్చి 17 : జగదాంబ దరి లేపాక్షి, వాచ్‌హౌస్ మెయిన్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహం వల్ల వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. లక్కీ షాపింగ్ మాల్ పోలీస్ బీట్ వద్ద ఉన్న కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరంతా ఆదివారం రోడ్డుపైకి చేరింది. లేపాక్షి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు వరకూ నీరు ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ పక్కనున్న వ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు మురుగు నీటి దుర్వాసనతో నరకం చూశారు. షాపింగ్ మాల్‌కు వచ్చిన వారు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇండస్ వైపు నుంచి వెళ్లే కాలువలు వ్యర్థాలతో పూర్తిగా పూడికపోవడంతో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. లక్కీ షాపింగ్ మాల్ పోలీస్ బీట్ వద్ద ఉన్న కాలువలోని పూడికలను పోలీసులు తొలగించినా ఫలితం లేకపోయింది. ఈవిషయమై స్థానికులు 29వ వార్డు పారిశుధ్య సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించలేదు.

బీచ్ రోడ్డులో 'భారత్ నివేష్ రన్' మారథాన్


గాలిలోకి బెలూన్లు ఎగురవేసి మారథాన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

మహారాణిపేట, మార్చి 17 : బీచ్ రోడ్డులో అసోసియేషన్ మ్యూచ్‌వల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీ అండ్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఆదివారం భారత్ నివేష్ రన్ మార థాన్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని సెబీ ఈడీ జి. రామ్మోహన రావు, ఏఎంఎఫ్ఐ చీఫ్ వెంకట చలసాని, ఈస్ట్రన్ కామాండ్ రీపిట్ ఆఫీసర్ ఎస్. సుభేషన్ ప్రారంభించారు. ఆర్థిక అక్షరాస్యత, శారీరక దృఢత్వం పెరుగుదల గురించి అవగాహన కల్పిస్తూ ఈ మారథాన్ నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రతిఒక్కరికి నిద్ర ఎంతో ముఖ్యం


మాట్లాడుతున్న డాక్టర్ రాజు

డాబా గార్డెన్స్, మార్చి 17 : ప్రతి ఒక్కరికి సరిపడ నిద్ర ఎంతో ముఖ్యమని డా. ఎన్.ఎన్. రాజు అన్నారు. ఆదివారం డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ నిద్రా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిద్రలేమి వల్ల ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, బీపీ, షుగర్ నియంత్రణ లేకపోవడం వంటివి వస్తాయని చెప్పారు. కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ నిర్దేశకుడు డా. నీహాల్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయానికి నిద్రకు ఉపక్రమించడం, పౌష్టికాహారం తీసుకోవడం, రెండు కిలోమీటర్ల నడవడం వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల


బాధ్యతలు స్వీకరిస్తున్న మంజుల

డాబా గార్డెన్స్, మార్చి 17 : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డా. ఆర్. మంజుల ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా.ఎస్.శోభారాణి రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమె స్థానంలో భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న మంజులను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పన్న హుండీ తాళం మాయం ?



సింహాచలం, మార్చి 17 : సింహగిరి మెట్ల మార్గం తొలిపావంచా వద్ద ఏర్పాటు చేసిన హుండీ తాళం పోయినట్టు తెలిసింది. ఈనెల 5న దేవస్థానం పరిధిలోని అన్నీ హుండీలను తెరిచి ఈఓ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. తొలిపావంచా వద్ద ఉన్న హుండీని కూడా లెక్కించేందుకు సిద్ధపడగా వారి వద్ద ఉన్న తాళాల గుత్తిలో హుండీకి సంబంధించిన కీ లేకపోవడంతో దానికి సీలు వేసి వదిలేశారు. హుండీలో నిత్యం మెట్ల మార్గంలో వెళ్లే భక్తులు కానుకలు సమర్పించడం పరిపాటి. కొద్ది రోజులుగా హుండీకి సీలు ఉన్నప్పటికీ అందులో కొందరు భక్తులు యథాప్రకారం కానుకలు వేసేవారు. ఈమేరకు హుండీ నిండిపోవడంతో కానుకలు హుండీ మూత నుంచి బయటకు వస్తుండడంతో కొందరు స్వార్థపరులు ఆ సొమ్మును స్వాహా చేస్తున్నట్టు సమాచారం. అధికారులు తక్షణమే హుండీని తెరిచి సొమ్మును స్వామివారి ఖజానాకు జమ చేయడంతో పాటు హుండీ తాళం పోవడానికి బాధ్యులెవరో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజా కాపునాడు నూతన కార్యవర్గం

డాబా గార్డెన్స్, మార్చి 17 : ప్రజా కాపు నాడు సంక్షేమ సంఘం విశాఖ, అనకాపల్లి జిల్లాల నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, ఉపాధ్యక్షుడు రెడ్డివీర రాఘవరావు ప్రకటించారు. ఆదివారం డాబా గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు ఆ వివరాలను వెల్లడించారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా మట్టా ప్రసాద్, నగర అధ్యక్షుడిగా పాండ్రంకి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా గంగునాయుడు, ప్రధాన కార్యదర్శిగా లగిసెట్టి సూర్యవెంకట ప్రసాద్‌ను నియమించారు. ఈమేరకు వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అల్లం రామానాయుడు, పెద్దాడ ఎరుకునాయుడు, శివాజీ, కంచిపాటి రాజునాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌బాబు

స్టీల్‌ప్లాంట్ దుస్థితికి జగనే కారణం

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17: ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ దయనీయ పరిస్థితికి రావడానికి రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వమే కారణమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ప్లాంట్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశాన్ని ఒకసారి కూడా ప్రధాని దృష్టికి జగన్ తీసుకువెళ్లలేదని ఆరోపించారు. రాష్ట్రంలో స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి నరేంద్రకుమార్, నమ్మి సింహాద్రి, పి.శ్రీనివాస్, ఎం.రఘుప్రసాద్, ఎం.అప్పలనాయుడు, కిరణ్, ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ర్యాలీ: స్తంభించిన ట్రాఫిక్



బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు

పెందుర్తి, మార్చి 17: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ తరఫున రెండోసారి కూడా పోటీ చేసేందుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. వేపగుంట నుంచి పెందుర్తి జంక్షన్ వరకు కార్యకర్తలు వైసీపీ జెండాలు పట్టుకుని బైక్ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేసి కూడలిలో మాట్లాడుతూ స్థానికతకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీ అధిష్ఠానం మరోసారి పెందుర్తి నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చిందన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

పెందుర్తిలో వైసీపీ శ్రేణులు బైక్ ర్యాలీ చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాలు బారులుతీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఎండ వేడిమి భరించలేక పలువురు వాహన చోదకులు అసహనం వ్యక్తం చేశారు.కాగా ర్యాలి శృతిమించి వైసీపీ కార్యకర్త బైక్ నడపడం వల్ల తన కారుపై గీతలు పడ్డాయని వాహన యజమాని ఆరోపించారు.

మేళాలో 126 మందికి ఉద్యోగాలు

శ్రీనగర్, మార్చి 17: ఇక్కడి టీఎస్సార్ టీబీకేలో దివ్యాంగులు, యువతులకు బ్రైన్ ట్రస్ట్ ఆర్గనైజేషన్, రైస్, హజారీ, కల్చర్ ఫౌండేషన్ ఆర్గనైజేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు సుమారు 1,200 మంది అభ్యర్థులు హాజరవ్వగా 126 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ఏసీపీ త్రినాథ్, జెడ్పీ నాయుడు, బీజేపీ నేత డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు, కళాశాల ఛైర్మన్ తలశిల బలరామకృష్ణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత శిక్షణ ఇచ్చి పలు సంస్థలు ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు.

నీతి కథలతో విజ్ఞానం, వినోదం

పెదగంట్యాడ, మార్చి 17: నీతి కథలు చదవడం వల్ల విజ్ఞానం, వినోదం కలుగుతుందని పెదగంట్యాడ శాఖ గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మా కిష్టం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నడుపూరు హైస్కూల్, నెల్లిముక్కు మోడల్ యూపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారేట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 140, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 90, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	196
స్కిన్‌లెస్	--	206

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ 1లో..

85వ వార్డులో వెలగని వీధి లైట్లు

రాత్రయితే అంధకారంతో అవస్థలు పడుతున్నామంటున్న పలు ప్రాంతాల ప్రజలు

జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన



అగనంపూడి ప్రధాన కూడలిలో పడకేసిన హైమాస్ట్ లైట్లు... పక్కన ఓ కాలనీలో వెలగని వీధి లైటు

అగనంపూడి, మార్చి 17: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 85వ వార్డు పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. గత కొన్ని నెలలుగా పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదని, దీంతో రాత్రయ్యేసరికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జీవీఎంసీ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు చేస్తున్నా ప్రయోజనం శూన్యంగా మారుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వివిధ పనుల నిమిత్తంచీకట్లోనే గడపాల్సిన పరిస్థితి ఎదురవుతుందని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో వందల సంఖ్యలో లైట్లు వెలగడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్య కూడళ్లలో హైమాస్ట్ లైట్లు సైతం పడకేశాయి. ఫార్మాసిటీ పునరావాస కాలనీలు ఏదూరివానిపాలెం, దొప్పవానిపాలెం, లేమర్తి, కొత్తపాలెం, ఈ-బోనంగి, పాలకాలయ్యపేట, గొన్నవానిపాలెం, ఈ-మర్రిపాలెం, పొన్నూరు అగ్రహారం, ఉక్కు నిర్వాసిత కాలనీలు పెదమడక, చినమడక, కొండయ్యవలస, అండమాన్ కొండయ్యవలస, కొత్తూరు, పూడివానిపాలెం, దిబ్బపాలెం, శనివాడ, దానబోయినపాలెం, సాయినగర్ కాలనీ,డొంకాడ, కర్రివానిపాలెం, బీసీ కాలనీలను వీధి లైట్ల సమస్య పట్టిపీడిస్తోంది. పూర్తి స్థాయిలో వీధిలైట్లు వెలగకపోవడంతో సాయంత్రం ఆరు దాటేసరికి ఆయా ప్రాంతాల్లో అంధకారం తాండవించి ఇళ్ల నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంటుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చీకటికి తోడు వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. మరోపక్క దొంగల బెడదతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వీధి లైట్లు వెలగడం లేదని గ్రేటర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొంటున్నారు. వీధి లైట్ల నిర్వహణ జీవీఎంసీ కమిషనర్ అయినా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు

గాజువాక: గాజువాక జోనల్ పరిధిలో ఉన్న దాదాపు అన్ని వార్డుల్లో ప్రజలు వీధిలైట్ల సమస్యతో సతమతమవుతున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే సమస్యతో ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. ఇండెంట్ పెట్టిన ఐదారు నెలలకొకసారి వచ్చే అరకొర వీధి లైట్లను వార్డుకు ఐదారు చొప్పున కేటాయిస్తున్నారు. కొత్త లైట్లు వచ్చేలోగా పాత లైట్లు కొన్ని పాడైపోతున్నాయి. దీంతో ఏ వార్డులోనూ పూర్తి స్థాయిలో వీధి లైట్ల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రధానంగా శివారు కాలనీ వార్డుల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. 76వ వార్డు పరిధిలోని స్వతంత్రనగర్, ఎస్టీ కాలనీ, రామచంద్రనగర్, బర్మాకాలనీ, హెచ్‌బీ కాలనీ, తదితర కాలనీల్లో అరకొరగా వీధి లైట్లు వెలుగుతుండడంతో ప్రజలు రాత్రిపూట రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క పాముల బెడద, మరోపక్క దొంగల బెడదతో ప్రజలు భీతిల్లుతున్నారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు మార్లు వార్డు కార్పొరేటర్లు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు కాలనీల్లో వీధి లైట్లు వేయాలని కోరుతున్నారు.

రాజ్యమేలుతున్న అంధకారం



గత కొన్ని నెలలుగా గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదు. సాయంత్రం ఆరు దాటితే గ్రామాల్లో అంధకారం రాజ్యమేలుతోంది. ఈ-మర్రిపాలెం, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై బస్సు దిగి ఇళ్లకు చేరేందుకు ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. వీధి లైట్లు వెలగపోవడంతో పాటు కుక్కలు వెంబడిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వీధి లైట్ల సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ చొరవ తీసుకుని లైట్లకు మరమ్మతులు చేయించాలి.

-దుల్ల చెల్లారావు ఈ-మర్రిపాలెం

టీడీపీ విజయం తథ్యం: ఎమ్మెల్యే గణబాబు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గణబాబు

సింధియా, మార్చి 17: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం విజయం సాధించడం తథ్యమని, తద్వారా రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని, ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే అమలు చేస్తారన్నారు. ముఖ్యంగా ప్రచారంలో బీసీ డిక్లరేషన్ గురించి ఆయన వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఆర్.రాజు, గేదెల రమణ, శివశంకర్, నాని, తదితరులు పాల్గొన్నారు.

'పెందుర్తి'లో 3,191 మంది టెన్త్ విద్యార్థులు.. 13 పరీక్ష కేంద్రాలు



అగనంపూడి పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బెంచీలు

పెందుర్తి, మార్చి 17: మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. గత ఏడాది అరకొర వసతుల మధ్యే విద్యార్థులు పరీక్షలు రాయడంతో ఈసారి ఆ పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో ఈ ఏడాది 3,191 మంది టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం 13 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత పెందుర్తి జెడ్పీ హైస్కూల్, చింతలగ్రహారం జెడ్పీ హైస్కూల్, వేపగుంట జెడ్పీ హైస్కూల్, గుర్రంపాలెం జెడ్పీ హైస్కూల్, పురుషోత్తపురంలోని మహతి స్కూల్, చైతన్య, నవ్యవికాస్, నారాయణ, నరవలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జామియా ఇస్లామిక్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను మౌలిక వసతులను కల్పించారు. కొన్ని కేంద్రాల్లో తగినన్ని బెంచీలు లేకపోవడంతో అప్పటికప్పుడు బయట నుంచి తెప్పించి ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యాన్‌లు బిగించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో సువర్ణ తెలిపారు.

కాగా గుర్రంపాలెం హైస్కూల్‌లో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా సదుపాయం లేదు. ఈ గ్రామానికి సిటీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలను విద్యార్థులు ఆశ్రయించాలి. మారుమూల పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించేలా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అగనంపూడి: ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ ప్రమీల తెలిపారు. ఈ కేంద్రంలో 192 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నందున ఎనిమిది గదులను కేటాయించామన్నారు. ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులందరూ హాల్ టికెట్లతో అరగంట ముందు రావాలని కోరారు.



ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహోత్సవాలు

వేపగుంట, మార్చి 17: నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రికొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. ఆయా పూజల్లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటలకు శ్రీవారికి పుష్పయాగం,ద్వాదశారాధనలు,ఊంజల్ సేవ, విశేష పూజలు, భోగ నివేదనలు చేపట్టారు. రుత్వికులను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన భరద్వాజ్ బృందంలోని రుత్వికులకు, ఉత్సవాలకు సహకరించిన వారికి ఈవో బండారు ప్రసాద్ కల్యాణ వెంకన్నస్వామి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస స్వామి, సారథి, ఉదయ్, సన్యాసిరావు, కృష్ణమూర్తి, భాను, తదితరులు పాల్గొన్నారు.

కలిసి పనిచేస్తే విజయం తథ్యం: మంత్రి అమర్‌నాథ్

గాజువాక, మార్చి 17: గాజువాక నియోజకవర్గంలో వైసీపీని గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగా అందిద్దామని మంత్రి, గాజువాక అసెంబ్లీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాకలోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా కలిసి పనిచేస్తే విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రత్యేక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల క్రమంలో తనను గాజువాక అభ్యర్థిగా సీఎం నియమించారన్నారు. 2019 ఎన్నికల్లో గాజువాకలో వైసీపీ అభ్యర్థి నాగిరెడ్డి విజయం కోసం ఎంతో కృషి చేశానన్నారు. పార్టీ కోసం శ్రమించే వారికి అండగా ఉంటూ, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, నాయకులు లతీష్, భూపతిరాజు సుజాత, పల్లా చినతల్లి, సన్ని, వాసు, శంకర్‌నారాయణ, రోజారాణి, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

నూతన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



బ్రహ్మసూత్ర శివలింగం

కూర్మన్నపాలెం, మార్చి 17: వడ్లపూడిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మసూత్ర శివలింగం, పంచముఖ వినాయకుడు, షిర్డీ సాయిబాబా, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, సీతారామాంజనేయస్వామి, నవగ్రహ మండపం, నూతన ధ్వజస్తంభం, నాగబంధం, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ ఊరేగించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనువాసరావు, కార్పొరేటర్ బొండా జగన్ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉత్సవాల్లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల దేవన్‌రెడ్డి, తాతనాయుడు, అప్పలరాజు, నాని, మాటూరి రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 17: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష బుచ్చిరాజుపాలెం, ఆర్.ఆర్.వి.పురం ఆళ్వార్ కళాశాలల్లో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఆయా కేంద్రాలలో పరీక్షలకు ఉదయం 480 అభ్యర్థులకుగాను 380 మంది, మధ్యాహ్నం 377 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పరీక్ష పూర్తయ్యాక ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది.



టీడీపీ హోర్డింగ్‌ను తొలగించి, వైసీపీ హోర్డింగ్‌ను ఉంచిన దృశ్యం

ఇలాగైతే ఎలా!

కోడ్ కూసినా వైసీపీపై అధికారులకు వీడని అభిమానం

కూర్మన్నపాలెం, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ అధికార పార్టీ వైసీపీపై జీవీఎంసీ అధికారులు ఎనలేని అభిమానాన్ని చూపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ప్రకటన హోర్డింగులను తొలగించిన జీవీఎంసీ సిబ్బంది వైసీపీ ప్రచార హోర్డింగుల జోలికి మాత్రం పోవడం లేదు. ఆదివారం శ్రీనగర్ నుంచి వడ్లపూడికి వెళ్లే దారిలో ఉన్న వైసీపీ ప్రచార హోర్డింగులే ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. ఆదివారం సాయంత్రం వరకు వీటిని తొలగించలేదు. ఎన్నికల కోడ్ వచ్చినా అధికారుల తీరు మారకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అగ్రిగోల్డ్ ఏజెంట్ల నిరసన ర్యాలీ



ప్లకార్డులు, బ్యానర్ ప్రదర్శిస్తున్న అగ్రిగోల్డ్ ఏజెంట్లు

గాజువాక, మార్చి 17: తన న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలంటూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం గాజువాకలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ బాధితులు గడిచిన ఐదేళ్లగా తమ నగదు కోసం పోరాడుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఆరెలమ్మ, మధుసూధన్, మంగరాజు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో ఆనంద్‌కుమార్ ప్రచారం

మల్కాపురం, మార్చి 17: గ్రేటర్ 61వ వార్డు పరిధి మల్కాపురంలో వైసీపీ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి తనను గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రజా సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైసీపీని మళ్లీ అధికారంలోకి తెస్తే ఈ పథకాలతో పాటు మరిన్ని కొత్తవి అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు పేర్కొన్నారు. మల్కాపురం పల్లెవీధి నుంచి రెడ్డివీధి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్, ఫుడ్ కోర్సులలో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 17: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ సంయుక్తంగా నిరుద్యోగులకు బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ (హోటల్ మేనేజ్‌మెంట్) కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 28 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 9121999654 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు విస్తరణ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

గోపాలపట్నం, మార్చి 17: లక్ష్మీనగర్ బైపాస్ రహదారి విస్తరణ బాధితుల సమస్యలను పరిష్కరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఇందిరానగర్, లక్ష్మీనగర్ మీదుగా కొండవాలు బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం గత ఏడాది మార్కింగ్ చేశారు. సుమారు 80 అడుగుల మేర రహదారి విస్తరణ చేపట్టడం కోసం జీవీఎంసీ అధికారులు మార్కింగ్ చేశారు. అయితే 80 అడుగులకు రోడ్డు విస్తరణ చేస్తే జనావాసాలను పెద్ద సంఖ్యలో తొలగించాల్సి ఉంటుందని, ఆ సమస్య తలెత్తకుండా 40 అడుగులకు రహదారిని విస్తరించాలని బాధితులు కోరారు. పాక్షికంగా ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం, డబుల్ టీడీఆర్‌లు ఇప్పించాలని, పూర్తిగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయ స్థలంతో పాటు ఇళ్లు నిర్మించుకోడానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. బాధితుల సమస్యలపై వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుకుమార్, ఉన్నతాధికారులతో చర్చిస్తానని బెహరా పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి కోరారు. గంట్యాడలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉక్కు యాజమాన్యం స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మేటి అప్పారావు, నాయుడు, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి త్రిశక్తి ఆలయ ప్రారంభోత్సవాలు

కూర్మన్నపాలెం, మార్చి 17: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో సుమారు రూ.కోటిన్నరతో నిర్మించిన త్రిశక్తి ఆలయాన్ని సోమవారం ప్రారంభించడంతో పాటు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేపడుతున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు 20వ తేదీ వరకు జరుగుతాయని, ఇందులో భాగంగా 108 కలశాలతో శోభాయాత్ర, చండీ హోమం, సారె ఊరేగింపు, అన్న సమారాధన చేపడతామన్నారు.

ఆలయానికి బీరువా వితరణ

అగనంపూడి, మార్చి 17: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస గ్రామ దేవత మరిడిమాంబ ఆలయానికి ఆలయ కార్య నిర్వాహక అధ్యక్షుడు పిల్లా రవి రూ.20 వేలు విలువ చేసే బీరువాను వితరణగా ఆదివారం కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బి.సత్యనారాయణ, బి.అప్పారావు, ఎం.రామచంద్రరావు, ఎస్.సన్యాసిరావు, బి.శ్రీను, కన్నారావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం
నియోజకవర్గం

రైతుబజారులో దొంగకు దేహశుద్ధి


పట్టుబడిన దొంగ

మర్రిపాలెం, మార్చి 17: ఇక్కడి రైతు బజారులో ఆదివారం కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఓ వినియోగదారుని జేబులో నుంచి సెల్ ఫోన్ దొంగిలించేందుకు యత్నిస్తూ ఓ యువకుడు పట్టుబడ్డాడు. దీంతో సదరు వినియోగదారునితో పాటు పలువురు కొనుగోలుదారులు ఆ దొంగకు దేహశుద్ధి చేసి రైతు బజారు ఎస్టేట్ అధికారికి అప్పగించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి ఆ దొంగను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కాగా మర్రిపాలెం రైతు బజారులో దొంగల బెడద ఎక్కువగా ఉందని, తరచూ సెల్ ఫోన్లను తస్కరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా బల్లల పండుగ

మాధవధార, మార్చి 17: జీవీఎంసీ 51వ వార్డు పరిధి అప్పయ్యనగర్‌లో ఆదివారం రజకుల బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. రజకుల కులవృత్తి లాభదాయకంగా సాగాలని కోరుకుంటూ దుస్తులు ఉతికే బండలనుపూజించారు. రజక సంఘం ప్రతినిధులు మడక సూరిబాబు, కె.అచ్చిబాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగలో వైసీపీ నాయకుడు కేకే రాజు పాల్గొని బల్లల వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల తర్వాత డీఎస్సీ నిర్వహించాలి'

అక్కయ్యపాలెం, మార్చి 17: ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలను ఎన్నికల తర్వాత జరపాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కోరారు. ఎన్నికల్లో పలువురు నిరుద్యోగులు కూడా పోటీ చేస్తున్నందున చదువుకునేందుకు సమయం ఉండదని, అందువల్ల ఆ తర్వాత నిర్వహించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రశ్నపత్రంలో పెద్ద ప్రశ్నల వల్ల సమయం సరిపోక అర్హత కోల్పోతారేమోనని, 1:100గా మెయిన్స్‌కు ఎంపిక చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారన్నారు. ఒక ప్రశ్నకు ఒక నిమిషం సమయమిస్తే ఎక్కువ ప్రశ్నలకు చిట్కాలు వాడినా ఐదు నిమిషాలు పడుతుందని, అందువల్ల ఏపీపీఎస్సీ నిర్వాహకులు పునరాలోచించి 1:100గా మెయిన్స్ ఎంపిక చేపట్టాలన్నారు.

30 నుంచి నూకాంబిక జాతర

మురళీనగర్, మార్చి 17: జీవీఎంసీ 49వవార్డులోని నూకాంబిక అమ్మవారి వార్షిక కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఈ నెల 30 నుంచి ఏప్రిల్ ఎనిమిదో తేదీ వరకు జరగనున్నాయి. నవరాత్రుల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నగేష్ ఉత్సవాల పోస్టరు ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఉడుపు రాటతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాల సందర్భగా నూకాంబిక అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు కుంకుమ పూజలు చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పీఎస్‌ల పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

సిబ్బందికి డీసీపీ-2 సత్తిబాబు సూచన


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ-2 సత్తిబాబు

మర్రిపాలెం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎలక్షన్ కమిషనర్ నిబంధనలకు అనుగుణంగా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని డీసీపీ-2 మోకా సత్తిబాబు సూచించారు. ఆదివారం ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ ఆవరణలో గల వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో ఆయన వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి కోడ్ అమలులోకి వచ్చినందున అందరూ తమ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉండాలన్నారు. సమావేశంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సౌత్ ఏసీపీలతో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


ఆర్పీ పాఠశాల స్కూల్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు

కంచరపాలెం, మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండడంతో కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని ఆర్పీపేట, కప్పరాడ, కె.కాలనీ,స్టెల్లా మేరిస్, మాధవధార, తదితర కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం తొమ్మిదన్నర నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించారు. కాగా ఆర్పీపేట పాఠశాలలో 240 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నందున పది గదులను సిద్ధంగా ఉంచారు. విద్యుత్, తాగునీరు, మెడికల్, తదితర సదుపాయాలు కల్పించినట్టు హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.


జ్ఞానాపురం ఫ్లైఓవర్‌పై మరమ్మతులు


పాఠశాల గోడను పునర్నిర్మించిన దృశ్యం

జ్ఞానాపురం ఫ్లైవోవర్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జ్ఞానాపురం, మార్చి 17: ఎట్టకేలకు జ్ఞానాపురం ఫ్లైవోవర్‌కు మరమ్మతులు చేపట్టారు. 'రంగులు సరే.. రోడ్ల మాటేమిటి' శీర్షికన ఈనెల ఆరో తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి గోతులను పూడ్చిస్తున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మాణం

సీతమ్మధార: నక్కవానిపాలెం, మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాలలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. అసంపూర్తి ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బాలబాలికలకు పౌష్టికాహారం పంపిణీ


చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

మురళీనగర్, మార్చి 17: జీవీఎంసీ 50వ వార్డులో 'మా వాకర్స్ క్లబ్' ఆధ్వర్యంలో ఆదివారం క్రీడా సాధన చేస్తున్న బాలబాలికలకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ చిన్నారులకు మజ్జిగ, గుడ్లు, అరటిపండ్లను అందజేశారు. మా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల బాక్సింగ్ క్రీడలో ప్రాక్టీస్ చేస్తున్న బాలలను అభినందించారు. బాక్సింగ్ కోచ్ చౌదా, ఎస్.భానుప్రకాశ్, మా వాకర్స్ క్లబ్ సెక్రటరీ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అది ఆలిండియా చంద్రబాబు కమిటీ సభ

కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రం గురించి మాట్లాడే హక్కు లేదు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

గాజువాక, మార్చి 17: ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో శనివారం నిర్వహించిన సభ కాంగ్రెస్ పార్టీది కాదని, ఆలిండియా చంద్రబాబు కమిటీ సభ అంటూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. ఆదివారం గాజువాకలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సభను చంద్రబాబు లబ్ధి కోసం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిర్వహించారని విమర్శించారు. చంద్రబాబు అజెండానే షర్మిల అజెండా అని అన్నారు. చంద్రబాబు ప్రత్యక్షంగా ఒక పార్టీతో, పరోక్షంగా మరో పార్టీతో పొత్తులు పెట్టుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని విభజించి చిన్నాభిన్నం చేసిన కాంగ్రెస్ పార్టీకి, షర్మిలకు ఏపీ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడే హక్కు వైసీపీకి, స్టీల్‌ప్లాంట్ యూనియన్‌లకు, సెంటిమెంట్‌గా భావించే వారికి మాత్రమే ఉందని ఆయనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసిన రాష్ట్రంలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా దక్కించుకోలేదని అమర్‌నాథ్ పేర్కొన్నారు.

కోడ్ అమలులో వివక్ష!

... 5వ పేజీ తరువాయి

అధికారులు, చాలా చోట్ల వైసీపీకి చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల జోలికి వెళ్లకుండా వదిలేశారు. తగరపువలస నుంచి ఆనందపురం జంక్షన్, కొమ్మాది, మద్దిలపాలెం వరకూ జాతీయ రహదారి వెంబడి ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వైసీపీకి చెందిన 'సిద్ధం, నాకు ఒక కల ఉంది' వంటి నినాదాలతో ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీలను హోర్డింగ్‌లను తొలగించాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ, జిల్లా అధికారులు, సిబ్బంది వాటిని అలాగే వదిలేశారు. శ్రీనగర్ నుంచి వడ్లపూడి వెళ్లే దారిలో కూడా వైసీపీకి చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను వదిలేసిన అధికారులు, ఇతర పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను మాత్రం పూర్తిగా తొలగించడం ఆశ్చర్యానికి గురిచేసింది. నగరం నడిబొడ్డున సిరిపురం కూడలి, ఎల్ఐసీ భవనం వెనుకరోడ్డు, రామ్‌నగర్ కూడళ్లలో కూడా ఇతర పార్టీల ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు, వైసీపీ ఫ్లెక్సీల జోలికి వెళ్లకపోవడం విశేషం. వైసీపీ అధికారంలో ఉందనే భయంతో ఆపార్టీ పట్ల అధికారులు ఇంతకాలం ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని భావించి ప్రజలకు, ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చిన తర్వాత కూడా అదే అవ్యాజ్య ప్రేమను చూపుతున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

ఉంచారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేస్తున్న నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహిస్తారు. చంద్రంపాలెం, తోటగరువు, గాజువాక, నడుపూరు, కణితి, గోపాలపట్నం ఉన్నత పాఠశాలల్లో ఏ, బీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ప్రతి సెంటర్‌లో సామర్థ్యాన్ని బట్టి గదికి 24 మంది, తక్కువగా 16 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు సెంటర్లలో ఏర్పాట్లను డీఈవో చంద్రకళ ఆదివారం పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలంటూ 'ఆల్‌ది బెస్ట్' చెప్పారు.

మధ్యాహ్నం ఓపెన్ స్కూళ్ల పరీక్షలు

కాగా జిల్లాలో పది, ఇంటర్ ఓపెన్‌స్కూల్ పరీక్షలు సోమవారమే ప్రారంభమవుతాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించే పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరగకుండా ప్రతి కేంద్రంలో సిటింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

అమర్‌పై అసంతృప్తి!

... 5వ పేజీ తరువాయి

సమన్వయకర్తగా కొనసాగుతున్న తిప్పల దేవన్‌రెడ్డిని కాదని కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును పార్టీ అధిష్ఠానం నియమించి, అతనినే అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి అసమ్మతి జ్వాలలు రేగుతున్నాయి. పార్టీ నిర్ణయాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా తనకు గాని, తాను సూచించిన వ్యక్తికి గాని టికెట్ ఇవ్వాలంటూ అనుచరవర్గంతో కలిసి తాడేపల్లిలో ప్రయత్నాలు చేశారు. దీంతో సామాజిక సమీకరణల నేపథ్యంలో చందును సమన్వయకర్తగా నియమించామని, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వివరణ ఇచ్చారు.

ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని అభ్యర్థిగా ప్రకటించాలని నాగిరెడ్డి పట్టుబట్టారు. ఈ క్రమంలో కొద్దిరోజులు నియోజకవర్గమంతటా మేయర్‌తో కలిసి పర్యటించి, జనానికి పరిచయం కూడా చేశారు. అయితే గాజువాకలో కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండడం కలిసి వస్తుందని టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పైరవీలు చేశారు. మరో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఇదిలా ఉండగా సమన్వయకర్తగా నియమించిన చందును మార్చిన పార్టీ అధిష్ఠానం ఊహించని విధంగా మంత్రి అమర్‌నాథ్‌ను రంగంలోకి తెచ్చింది. అయినప్పటికీ నేతల అసంతృప్తి చల్లారకపోవడంతో అమర్ నిర్వహించిన తొలి సమావేశం పేలవంగా జరిగింది.

పిల్లల ఆస్పత్రి హుళక్కే?

... 5వ పేజీ తరువాయి

సీఎం ఆదేశించి పలుమార్లు సమీక్ష నిర్వహించారు. విశాఖలో పీడియాట్రిక్ ఆస్పత్రి ఏర్పాటుకు రూ.197 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆర్‌సీడీ ఆస్పత్రి 25 ఎకరాల్లో ఉంది. 70 పడకలతో రోగులకు సేవలు అందిస్తున్నారు. పీడియాట్రిక్ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తే సుమారు 500 పడకలతో అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇక్కడ పోలియో, సెరిబ్రల్ పాలసీతో బాధపడే చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించడంతోపాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ వంటి సేవలు అందిస్తున్నారు. దీనిని పీడియాట్రిక్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్/ అభివృద్ధి చేసినా పీడియాట్రిక్ న్యూరో, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ ఫిజియోథెరపీ వంటి అధునాతన శస్త్ర చికిత్స విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఆయా విభాగాలకు సంబంధించిన స్పెషలిస్టు వైద్యులు, ఇతర వైద్య సిబ్బందిని నియమిస్తారు. దీనివల్ల చిన్నారులకు సంబంధించిన వైద్య సేవల్లో ఇదో అడ్వాన్స్‌డ్ సెంటర్‌గా మార్చేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే అవకాశాల ముగిసినట్టేనని చెబుతున్నారు. కాగా ఈ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయించేందుకు పనిచేసిన ఓ అధికారి కూడా బదిలీపై వెళ్లిపోవడంతో పీడియాట్రిక్ ఆస్పత్రి ప్రతిపాదన హుళక్కేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

వ్యాపారుల దందా!

... 5వ పేజీ తరువాయి

తీసుకుని, అదనపు వస్తువులను విక్రయించడం, ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. వాటర్‌బాటిల్ ఎంఆర్‌పీ రూ.20 ఉంటే కొన్ని దుకాణాల్లో రూ.25, మరిన్ని దుకాణాల్లో రూ.30కు విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింకు అరలీటర్ రూ.40 కాగా, రూ.50కి విక్రయిస్తున్నారు. చిన్నపిల్లలు ఇష్టంగా తినే లేస్ చిన్న ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.15కాగా రూ.20కి విక్రయిస్తున్నారు. బ్రిటానియా బిస్కెట్ ప్యాకెట్ చిన్నది రూ.20 కాగా రూ.25కి విక్రయిస్తున్నారు. అధికంగా వసూలు చేయడంపై ప్రయాణికులు నిలదీస్తే 'నచ్చితే కొనండి. లేకపోతే వెళ్లిపోండంటూ' నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. దీంతో కొంతమంది ప్రయాణికులు వ్యాపారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. నిత్యం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా బస్‌స్టేషన్‌లోని అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా అధికారులకు వివరిస్తే, లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని మాత్రమే సమాధానమిస్తున్నారు. దుకాణాల నిర్వాహకుల నుంచి అధికారులకు ప్రతినెలా మామూళ్లు అందుతుండడంతోనే చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంఆర్‌పీ ఉల్లంఘిస్తే చర్యలు

- అంధవరపు అప్పలరాజు, రీజనల్ మేనేజర్

ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో ఎంఆర్‌పీకి మాత్రమే విక్రయించాలి. ఎవరైనా ఉల్లంఘిస్తే లిఖితపూర్వకంగా స్టేషన్ మేనేజర్ కార్యాలయం, విచారణ కౌంటర్ వద్ద ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టెలో వేస్తే, పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఉల్లంఘన రుజువైతే మొదటిసారి రూ.500 నుంచి రూ.వెయ్యి జరిమానా, తర్వాత కూడా ఉల్లంఘన జరిగితే దుకాణం రద్దుకు నోటీసు ఇస్తాం. అప్పటికీ మారకుంటే కేటాయింపును రద్దుచేస్తాం.

ఉల్లంఘనలపై 100 నిమిషాల్లో స్పందించాలి

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోతే సమీపంలోని జీవీఎంసీ, పోలీస్ శాఖల సీసీ కెమెరాలు పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. రిటర్నింగ్ అధికారి తమ పరిధిలో సింగిల్ విండోవిధానం, మీడియాసెల్, కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నియమావళిని అమలుచేయండి

సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఉద్యోగులంతా ఎన్నికల నియమావళిని పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ షెడ్యూల్ విడుదలైన 24 గంటల్లో ప్రభుత్వ ఆస్తులపై గల అన్నిరకాల గోడ రాతలు, పోస్టర్లు, కటౌట్లు, బేనర్లు, హోర్డింగ్‌లు, జెండాలు తొలగించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు, బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, రోడ్ వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మునిసిపల్ సమావేశ ప్రదేశాల్లో రాతలు, కటౌట్లు, తొలగించాలని ఆదేశించారు. సీ విజిల్ మానటరింగ్ ఫిర్యాదుల పరిష్కారం, ఫిర్యాదులపై 24 గంటల్లో తీసుకున్న చర్యలు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. వలంటీర్ల విధులపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు.ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పనిచేసేలా చూడాలన్నారు.జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, అడిషినల్ కమిషనర్ విశ్వనాథన్, జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ దక్షిణం
నియోజకవర్గం

కనక మహాలక్ష్మికి రూ. లక్ష విరాళం

జగదాంబ కూడలి, మార్చి 17 : వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన చల్లా సుధారాణి దంపతులు లక్ష రూపాయలు విరాళం సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో వారు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డికి ఆదివారం అందజేశారు. దాత కుటుంబీకులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

రోడ్లపై మురుగుతో అవస్థలు


లేపాక్షి వద్ద మెయిన్ రోడ్డుపై మురుగు నీరు


కాలువలో నుంచి బయటకు వస్తున్న నీరు

జగదాంబ కూడలి, మార్చి 17 : జగదాంబ దరి లేపాక్షి, వాచ్‌హౌస్ మెయిన్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహం వల్ల వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. లక్కీ షాపింగ్ మాల్ పోలీస్ బీట్ వద్ద ఉన్న కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరంతా ఆదివారం రోడ్డుపైకి చేరింది. లేపాక్షి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు వరకూ నీరు ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ పక్కనున్న వ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు మురుగు నీటి దుర్వాసనతో నరకం చూశారు. షాపింగ్ మాల్‌కు వచ్చిన వారు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇండస్ వైపు నుంచి వెళ్లే కాలువలు వ్యర్థాలతో పూర్తిగా పూడికపోవడంతో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. లక్కీ షాపింగ్ మాల్ పోలీస్ బీట్ వద్ద ఉన్న కాలువలోని పూడికలను పోలీసులు తొలగించినా ఫలితం లేకపోయింది. ఈవిషయమై స్థానికులు 29వ వార్డు పారిశుధ్య సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించలేదు.

బీచ్ రోడ్డులో 'భారత్ నివేష్ రన్' మారథాన్


గాలిలోకి బెలూన్లు ఎగురవేసి మారథాన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

మహారాణిపేట, మార్చి 17 : బీచ్ రోడ్డులో అసోసియేషన్ మ్యూచ్‌వల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఆదివారం భారత్ నివేష్ రన్ మార థాన్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని సెబీ ఈడీ జి. రామ్మోహన రావు, ఏఎంఎఫ్ఐ చీఫ్ వెంకట చలసాని, ఈస్టర్న్ కామాండ్ రీపిట్ ఆఫీసర్ ఎస్. సుబేషన్ ప్రారంభించారు, ఆర్థిక అక్షరాస్యత, శారీరక దృఢత్వం పెరుగుదల గురించి అవగాహన కల్పిస్తూ ఈ మారథాన్ నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రతిఒక్కరికి నిద్ర ఎంతో ముఖ్యం


మాట్లాడుతున్న డాక్టర్ రాజు

డాబా గార్డెన్స్, మార్చి 17 : ప్రతి ఒక్కరికి సరిపడ నిద్ర ఎంతో ముఖ్యమని డా. ఎన్.ఎన్. రాజు అన్నారు. ఆదివారం డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ నిద్రా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిద్రలేమి వల్ల ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, బీపీ, షుగర్ నియంత్రణ లేకపోవడం వంటివి వస్తాయని చెప్పారు. కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ నిర్దేశకుడు డా. నీహాల్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయానికి నిద్రకు ఉపక్రమించడం, పౌష్టికాహారం తీసుకోవడం, రెండు కిలోమీటర్ల నడవడం వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల


బాధ్యతలు స్వీకరిస్తున్న మంజుల

డాబా గార్డెన్స్, మార్చి 17 : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డా. ఆర్. మంజుల ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా.ఎస్.శోభారాణి రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమె స్థానంలో భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న మంజులను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పన్న హుండీ తాళం మాయం ?



సింహాచలం, మార్చి 17 : సింహగిరి మెట్ల మార్గం తొలిపావంచా వద్ద ఏర్పాటు చేసిన హుండీ తాళం పోయినట్టు తెలిసింది. ఈనెల 5న దేవస్థానం పరిధిలోని అన్నీ హుండీలను తెరిచి ఈఓ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. తొలిపావంచా వద్ద ఉన్న హుండీని కూడా లెక్కించేందుకు సిద్ధపడగా వారి వద్ద ఉన్న తాళాల గుత్తిలో హుండీకి సంబంధించిన కీ లేకపోవడంతో దానికి సీలు వేసి వదిలేశారు. హుండీలో నిత్యం మెట్ల మార్గంలో వెళ్లే భక్తులు కానుకలు సమర్పించడం పరిపాటి. కొద్ది రోజులుగా హుండీకి సీలు ఉన్నప్పటికీ అందులో కొందరు భక్తులు యథాప్రకారం కానుకలు వేసేవారు. ఈమేరకు హుండీ నిండిపోవడంతో కానుకలు హుండీ మూత నుంచి బయటకు వస్తుండడంతో కొందరు స్వార్థపరులు ఆ సొమ్మును స్వాహా చేస్తున్నట్టు సమాచారం. అధికారులు తక్షణమే హుండీని తెరిచి సొమ్మును స్వామివారి ఖజానాకు జమ చేయడంతో పాటు హుండీ తాళం పోవడానికి బాధ్యులెవరో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజా కాపునాడు నూతన కార్యవర్గం

డాబా గార్డెన్స్, మార్చి 17 : ప్రజా కాపు నాడు సంక్షేమ సంఘం విశాఖ, అనకాపల్లి జిల్లాల నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, ఉపాధ్యక్షుడు రెడ్డివీర రాఘవరావు ప్రకటించారు. ఆదివారం డాబా గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు ఆ వివరాలను వెల్లడించారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా మట్టా ప్రసాద్, నగర అధ్యక్షుడిగా పాండ్రంకి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా గంగునాయుడు, ప్రధాన కార్యదర్శిగా లగిసెట్టి సూర్యవెంకట ప్రసాద్‌ను నియమించారు. ఈమేరకు వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అల్లం రామానాయుడు, పెద్దాడ ఎరుకునాయుడు, శివాజీ, కంచిపాటి రాజునాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సిరుల దేవునికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మార్చి 17 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహావచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ నామానికొక స్వర్ణ సంపెంగలతో స్వామిని అర్చించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించారు. కాగా రెండు రోజులుగా సింహాచలం పరిసరాల్లోనే కాకుండా నగర వ్యాప్తంగా వివాహాలు జరగడంతో నవ దంపతులు ఆదివారం వేకువజామున సుప్రభాత సేవ నుంచి సాయంత్రం వరకు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు.

తగరపువలసలో ముత్తంశెట్టి రోడ్ షో



తగరపువలస, మార్చి 17 : జీవీఎంసీ 1, 2 వార్డుల్లో వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జీరు వెంకటరెడ్డి, కరుణాకర్, వంశీ, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌కు ఎనిమిది పరీక్షా కేంద్రాలు

ఆరిలోవ, మార్చి 17 : ఆరిలోవ పరిధిలో పదో తరగతి పరీక్షలకు ఎనిమిది కేంద్రాలను కేటాయించినట్టు చినగదిలి ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారంనుంచి ఈనెల 30 వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 9 గంటలకే చేరు కోవాలని చెప్పారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా 500 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు.

పద్మనాభంలో నాలుగు కేంద్రాలు..

పద్మనాభం : మండలంలో నాలుగు కేంద్రాల్లో టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 10 జెడ్పీ పాఠశాలలు, ఒక కేజీబీవీ, 5 ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మద్ది పాఠశాలలోని కేంద్రంలో 200 మంది, రేవిడి పాఠశాలలో 163, పద్మనాభం పాఠశాలలో 181, రెడ్డిపల్లి పాఠశాలలో 180 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

95 మందికి హోమియో వైద్య సేవలు

భీమునిపట్నం, మార్చి 17 : భీమిలిలో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 95 మంది సేవలు పొందారు. చిన్నబజారు డచ్ రోడ్‌లో వున్న ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. హోమియో వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన పాశర్ల

సింహాచలం, మార్చి 17 : అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ కాంగ్రెస్‌లో చేరారు. శనివారం గాజువాకలో జరిగిన న్యాయసాధన సభలో ఆయనకు షర్మిల కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 140, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 90, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



మద్దిలపాలెంలోని డిపో రోడ్డులో దుకాణానికి ఉన్న బోర్డు



కొమ్మాదిలో బస్టాప్ పైఉన్న సిద్ధం ఫ్లెక్సీ



ఆనందపురం నుంచి తగరపువలస వెళ్లే హైవేలో..

ఎక్కడి ఫ్లెక్సీలు అక్కడే

- ఎన్నికల నిబంధనలు పట్టని అధికారులు
- అధికార పార్టీ బోర్డులు తొలగింపులో అలసత్వం
- ప్రజల నుంచి విమర్శలు

మద్దిలపాలెం/కొమ్మాది/ఆనందపురం, మార్చి 17 : రాష్ట్రంలో శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. నిబంధనల ప్రకారం రాజకీయ నాయకులతో ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించడంతో పాటు నేతల విగ్రహాలను క్లాత్‌లతో మూసివేయాలి.కానీ చాలా చోట్ల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపులో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మద్దిలపాలెంలో బడ్డీలపై ఏర్పాటు చేసిన 'మా నమ్మకం 'నువ్వే జగనన్న' బోర్డులను తొలగించకుండా వదిలేశారు. 23వ వార్డులో ఎక్కడ చూసిన ఈబోర్డులు దర్శనమిస్తున్నాయి.వైసీపీ కార్పొరేటర్ గుడ్ల సత్యసాయి ప్రాతనిధ్యం వహిస్తున్న ఈ వార్డులో కిరణా దుకాణాలకు గతంలో మా నమ్మకం నువ్వే జగన్ పేరిట బోర్డులు తయారు చేసి ఏర్పాటు చేశారు. వైసీపీ జెండా రంగులతో జగన్ చిత్రం, మా నమ్మకం నువ్వే జగన్ అని రాసి కింద కిరణా దుకాణం పేరు ముద్రించి దాదాపు వంద బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఎలా ఉన్నా.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయపరమైన ప్రకటనలు ఉన్న బోర్డులు తొలగించాలి. కానీ మద్దిలపాలెం, చైతన్యనగర్, రామాలయం ప్రాంతాల్లో దుకాణాలకు ఉన్న బోర్డులు తొలగించలేదు.

కొమ్మాది జంక్షన్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బస్టాప్‌పై సిద్ధం పోస్టర్లు ఆదివారం సాయంత్రానికి కూడా తొలగించలేదు. హైవేకు ఆనుకుని వైసీపీకి చెందిన సిద్ధం హోర్డింగులు, ఫ్లెక్సీలు ఉన్నా.. పట్టని అధికారులు టీడీపీ, జనసేన, బీజేపీ ఫ్లెక్సీలను మాత్రం ఆఘమేఘాల మీద తొలగించారు.

ఆనందపురంలో కూడా వైసీపీ ఫ్లెక్సీలు, హోర్డింగులు తప్ప ప్రతిపక్షాలకు చెందిన ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించారు.అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, బోర్డులు, హోర్డింగులను చూసిన వారు ఎన్నికల నిబంధనలు వీళ్లకు వర్తించవా అని ప్రశ్నిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీలో ప్రచారం చేస్తున్న పట్టాభిరామ్, తదితరులు

బలరాంనగర్‌లో 'కూటమి' ఆత్మీయ సమావేశం

మద్దిలపాలెం, మార్చి 17 : తూర్పు నియోజకవర్గం ప్రజలు నాలుగోసారి కూడా తనను గెలిపించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. 22వ వార్డు బలరాంనగర్‌లో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకే పని చేస్తారు, మాకు చేయారన్న అపనమ్మకం ఎవరికీ వద్దన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు సమన్వాయం చేస్తామని చెప్పారు. ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించిన ప్రతిఒక్కరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డులోని యాదవ, కాపు, వెలమ, ముస్లిం నాయకులు వెలగపూడికి తమ మద్దతు తెలిపారు. అలాగే వారి సమస్యలను విన్నవించారు. సమావేశంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి, ఆనంద్, జనసేన నాయకులు పీతల మూర్తి, పోతు వెంకట ప్రసాద్, పెసల శ్రీను, దేవర రఘు పాల్గొన్నారు.

వెలగపూడి సతీమణి ప్రచారం

విశాలాక్షినగర్ : నిత్యం ప్రజలతో మమేకమై, వారి సమస్యలను పరిష్కరించడంలో వెలగపూడి రామకృష్ణబాబు ముందుంటారని ఆయన సతీమణి వెలగపూడి సుజన అన్నారు. ఆదివారం ఆమె 9వ వార్డు పరిధిలోని చలపతినగర్, రామాలయం వీధి ఎదురుగా ఉన్న వీధులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెనుక భాగంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ వెలగపూడిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, సవిత, సరోజ, రాధిక, సుమ, దేవి, హరిత, దీప పాల్గొన్నారు.

టీడీపీకి ఘన విజయం చేకూర్చండి

ఎంవీపీ కాలనీ : సైకిల్ గుర్తుకు ఓటేసి, తెలుగుదేశానికి ఘన విజయం చేకూర్చాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఓటర్లను కోరారు. ఆదివారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఎనిమిదో సెక్టరులో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడిని నాలుగోసారి గెలిపించాలని కోరారు.

కన్నుల పండువగా యల్లమ్మ జాతర



అమ్మవారికి భక్తుల పూజలు

వెంకోజీపాలెం, మార్చి 17 : పాత వెంకోజీపాలెంలోని యల్లమాంబ నగర్‌లో వేంచేసి ఉన్న యల్లమ్మ తల్లి జాతర ఆదివారం కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. కమిటీ సభ్యులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ అర్చకుడు సంతోష్ శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు జరిపారు.భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం శ్రీసీతారామ సేవా సంఘం తరఫున అమ్మవారికి ఇక్కడి రామాలయం నుంచి మంగళవాయిద్యాలు, గరిడీతో ఊరేగింపుగా సారె తీసుకువెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యల్లమాంబ నగర్ కమిటీ అధ్యక్షురాలు వారణాసి విశాలాక్షి, ఉపాధ్యక్షుడు మూర్తిరాజు, కార్యదర్శి కాళ్ల కుమార్, కోఆర్డినేటర్ కాళ్ల అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందరరావు, కాళ్ల జగదీష్, గంట్ల నాగరాజు, రాజారావు, కిషోర్, సత్యనారాయణ, సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు పీల వెంకట పరదేశినాయుడు, అధ్యక్షుడు ఆడారి పరదేశి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జూకు పర్యాటకుల తాకిడి

ఆరిలోవ, మార్చి 17 : నగరంలోని జూపార్కు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. సుమారు 2095 మంది పర్యాటకులు జూను సందర్శించారు. వారి వద్ద నుంచి రూ. 2.33 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు రెండు కేంద్రాలు

భీమునిపట్నం, మార్చి 17 : ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఎంఈఓ -1 ఎం. శివరాణి తెలిపారు.ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీ రోడ్‌లో వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని, పట్టణంలో ఉన్న సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు జరుగుతాయన్నారు. టెన్త్ పరీక్షలకు 170 మంది అభ్యర్థులు, ఇంటర్ పరీక్షలకు 247 మంది హాజరుకానున్నట్టు చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

సాగర్‌నగర్, మార్చి 17 : సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈ టీఈఇ) విభాగం ఆధ్వర్యంలో ఆదివారం రుషికొండలో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం ఐఈటీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ భరణి చంద్రకుమార్, కన్వీనర్ సెవెన్త్ లైన్ మాట్లాడుతూ సైబర్ నేరాల్లో భారత్ ప్రపంచంలో 80వ స్థానంలో ఉందని, ఏటా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందన్నారు. అనం తరం విద్యార్థులు పలు నినాదాలతో కూడిన బోర్డులను ప్రదర్శించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్‌డీఓ

పద్మనాభం (రూరల్), మార్చి 17 : ఎన్నికల కోడ్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భీమిలి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ భాస్కర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడూతూ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తామన్నారు. కోడ్‌పై సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పిస్తామని తెలిపారు. సీఐ శ్రీధర్ మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

తగరపువలసలో కేంద్ర బలగాల కవాతు



తగరపువలస మెయిన్‌రోడ్డులో కేంద్ర బలగాల కవాతు

తగరపువలస, మార్చి 17 : ఎన్నికల నేపథ్యంలో తగరపువలస, భీమిలిలో కేంద్ర బలగాలు ఆదివారం కవాతు నిర్వహించాయి.ఎన్నికల్లో ఎటువంటి గొడవలు జరగకుండా భరోసా కల్పిస్తూ ఈ కవాతు చేపట్టారు. సీఐ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హరీష్, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఎంవీపీ కాలనీ, మార్చి 17 : పౌరహిత్యం చేస్తూ ఇద్దరు ఆడ పిల్లలకు చదువు చెప్పిస్తున్న పేద కుటుంబానికి శర్మదాయని సంస్థ రూ. 1,16,116 లక్షల ఆర్థిక సాయం అందించింది. ఎంవీపీ కాలనీలో నివాసం ఉంటున్న రవికుమార్ శర్మ కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆయన అనారోగ్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సంస్థ సభ్యులు తమవంతుగా సాయం అందించినట్టు సంస్థ అధ్యక్షుడు రాచకొండ దశరదరామయ్య తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మధిర రాజశేఖర్, శ్రీమతి మంజుల, తదితరులు పాల్గొన్నారు.



అనంతుని పెళ్లి రాట సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

సంప్రదాయబద్ధంగా అనంతుని పెళ్లి రాట

పద్మనాభం, మార్చి 17 : పద్మనాభంలో అనంత పద్మనాభుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి పెళ్లి రాట సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈనెల 21 నుంచి 26 వరకు జరిగే కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కుంతీమాధవస్వామి ఆలయం వద్ద పెళ్లి రాట వేశారు. ముందుగా వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజల అనంతరం పెళ్లి రాట వేసి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మహిళలు పసుపు దంచి పెళ్లి పనులను ప్రారంభించారు. ఆలయ ఈఓ ఎస్. నానాజీబాబు ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు టి. పద్దు, పద్మనాభస్వామి, సన్యాసినాయుడు, ఈశ్వరరావు, పైడిరాజు, సన్నిబాబు, అర్చకులు సీతారామాంజనేయ స్వామి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా గాంధీ కల్యాణ మండపం



మహాత్మాగాంధీ కల్యాణ మండపం



అపరిశుభ్రంగా ఉన్న మండపం ఆవరణ

భీమునిపట్నం, మార్చి 17 : పట్టణంలోని మహాత్మాగాంధీ కల్యాణ మండపం అసాంఘిక కార్య కలాపాలకు అడ్డాగా మారుతోంది. సీబీఎం స్కూల్ రోడ్డులో 1996లో వుడా నిర్మించిన ఈ కల్యాణ మండపం నిర్వహణ బాధ్యతను అప్పటి పురపాలక సంఘానికి అప్పగించారు. కొన్నేళ్లు నిర్వహించిన తరువాత వారు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. కరోనా సమయంలో లీజు కాలపరిమితి ముగియడంతో జీవీఎంసీ బహిరంగ వేలం నిర్వహించింది. కల్యాణ మండపం భవనం పూర్తిగా శిథిలం కావడం, మరోవైపు జీవీఎంసీ నెలకు రూ. 39 వేలు అద్దె నిర్ణయించడంతో వేలంలో పాల్గొనడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో జీవీ ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో కల్యాణ మండపానికి రూ. 19.60 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. అయినా భవనం మెరుగుపడలేదు. దీంతో మళ్లీ శిథిలమైన భవనాన్ని తొలగించి కొత్తగా నిర్మించాలని ప్రతిపాదన చేశారు. కానీ పనులు సాగలేదు. ఫలితంగా సుమారు ఏడాదిగా పర్యవేక్షణ కొరవడి కల్యాణ మండపం పరిస్థితి అధ్వానంగా మారింది. తలుపు గడియలు విరిగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టపగలు మందుబాబులు మద్యం తాగుతున్నారు. రాత్రివేళల్లో అసాంఘిక పనులకు పాల్పడుతున్నారు. ఆవరణలో పొదలు పెరిగిపోవడంతో పాముల సంచా రం ఎక్కువగా ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై భీమిలి జోన్ అసిస్టెంట్ ఇంజనీరు సుమన్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా కల్యాణ మండపం మరమ్మతుకు జీవీఎంసీ రూ. 19.60 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే భవనం శిథిలం కావడంతో పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాలని ప్రతిపాదించామని చెప్పారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు.



ధాన్యపు గుత్తులతో జూ అధికారులు

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత

ఆరిలోవ, మార్చి 17 : జీవ వైవిధ్యంలో పిచ్చుకలకు ప్రత్యేక స్థానం ఉందని, వాటి సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా పిలుపునిచ్చారు. ప్రపంచ పిచ్చుకల సంరక్షణ దినోత్సవం సందర్భంగా అధికారులు జూలోని చెట్లకు ఆదివారం ధాన్యపు కుంచెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచ్చుకలు చేలల్లో ఉన్న చీడపీడల నుంచి పంటలను కాపాడి, రైతులకు మేలు చేస్తున్నాయన్నారు. వాటికి ఆహారం అందించే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. తునిలోని హరిత విహార్ ఫౌండేషన్ సహకారంతో పిచ్చుకలకు ఆహారం అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం జూకు వచ్చిన సందర్శకులకు పిచ్చుకల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. సుమారు 500 లకు పైగా కుంచెలను జూలోని చెట్లకు వేలాడదీశారు. ఈ కార్యక్రమంలో జూ డిడీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ గోపాలనాయుడు, హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ రత్నం

ఆరిలోవ, మార్చి 17 : పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని, కొంతమంది పిల్లలు చెడు స్నేహాలు చేసి మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని డీసీపీ రత్నకుమారి అన్నారు. ఆదివారం సెంట్రల్ జైలు సమీపంలోని రామకృష్ణాపురంలో ఉన్న పైడిమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత వక్రమార్గంలో సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో పలు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. పిల్లలను తల్లిదండ్రులు సన్మార్గంలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ మహేష్, ఏసీపీ వెంకటరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మురళీకృష్ణ, బాబూరావు, కాకార గోవింద్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, నల్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రసవ సంరక్షణపై అవగాహన సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

వెంకోజీపాలెం, మార్చి 17 : వెంకోజీపాలెంలోని మెడికవర్ విమెన్ అండ్ చైల్డ్ ఆసుపత్రి, ప్రసూతి, గైనకాలజికల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రసవ సంరక్షణ (పెరినాటల్ కేర్) పై అవగాహన సదస్సు జరిగింది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి సుమారు 300 మంది ప్రసూతి వైద్య నిపుణులు సదస్సుకు హాజరై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ డాక్టర్ ఛార్మీల అయ్యావో, డాక్టర్ ఎస్. తారకేశ్వరి మాట్లాడుతూ ఇటీవల ప్రసూతి సమయంలో ఎదురవుతున్న వైరల్ ఇన్ఫెక్షన్లు, జన్యుపరమైన సమస్యలకు సంబంధించి అవసరమైన పరీక్షలు గురించి వివరించారు. ముఖ్యంగా పిల్లల్లో అరుదుగా వచ్చే అవయవ లోపాలకు సరైన పరీక్షలు, నివారణ చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఎం. సాయి, సునీల్ కిశోర్, డాక్టర్ ఆర్. విద్యారామ, డాక్టర్ వి. సీతారామరాజు, డాక్టర్ ఎ. నిహారిక, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మధురవాడ, మార్చి 17 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో నగరానికి చెందిన జోష్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు ఆదివారం శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు చిన్మయి, గామిని, నక్షత్ర, లిఖిత, శ్యామల, యశస్విని, గున్విక, అనూహ్య, నవ్య, సౌజన్య, శ్రవంతి, కీర్తి, అక్షర, కోమల్, చందు పలు గీతాలకు నృత్యరీతులు సమకూర్చారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, మార్చి 17 : జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి కూడలిలో ఉన్న సద్గురు సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుడు రుద్రరాజు రమేష్ ఆధ్వర్యంలో ఉదయం నుంచీ బాబాకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ఐదు నుంచి అర్చనలు, పల్లకీ సేవ, సామూహిక దీపాలంకరణ చేపట్టారు.

వెంకన్నను దర్శించుకున్న మాజీ మంత్రి గంటా

సాగర్‌నగర్, మార్చి 17 : మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం రుషికొండలోని వెంకన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గంటా గోత్ర నామాలతో అర్చకులు పూజలు జరిపి వేదాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేసారు.